సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 4 | జూలై | 2025



'డ్రాగన్' కాసులు!

డ్రాగన్ తోటకు ఒక్కసారి పెట్టుబడి పెడితే దాదాపు ఇరవై ఏళ్ల వరకు దిగుబడి వస్తుండగా రైతులకు కాసులు కురుస్తున్నాయి. 4లో



అమ్మకానికి 'సెక్యూరిటీ'

సింగరేణి మణుగూరు ఏరియాలో ప్రైవేట్, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. 4లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన సమర్పించి హారతి, మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు శిక్షణ

భద్రాచలంటౌన్: సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. రెసిడెన్షియల్ విధానంలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్, శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వార్షికాదాయం రూ.3లక్షలకు మించని అభ్యర్థులు శుక్రవారం లోగా http.//twd. telangana gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆపై ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేసిన శిక్షణ ఇస్తారని తెలిపారు.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి

డీఎంహెచ్ఓ జయలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

గుండాల : ప్రజల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టి పెట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి జయలక్ష్మి అన్నారు. ఆళ్లపల్లి పీహెచ్‌సీని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, రక్తహీనతపై ప్రతీ గ్రామాన్ని, పాఠశాలలను సందర్శించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. పాము, తేలు, కుక్క కాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదని అన్నారు. నెలలు నిండిన గర్భిణులను ముందుస్తుగా ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. అనంతరం అనంతోగు బాలికల ఆశ్రమ పాఠశాల, మర్కోడు బాలుర ఆశ్రమ పాఠశాలలను సందర్శించి సికిల్‌సెల్ పరీక్షలను పరిశీలించారు. ఆమె వెంట వైద్యాధికారి సంఘమిత్ర, రేవంత్, సీహెచ్ఓ సోమ్లా నాయక్, ఎస్‌యూఓ హరికృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి, హెచ్‌ఏ నరేష్, శ్రీధర్‌బాబు, రేవతి, సావిత్రి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. కునుకు లేదు



కొద్దిపాటి వర్షానికే పెదవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్ నిండుగా వచ్చి చేరిన వరదనీరు

భయాందోళనలో పెదవాగు ఆయకట్టు రైతులు, లోతట్టు ప్రజలు

- ఏపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందంటూ అసహనం
- జిల్లా మంత్రి పరిచయాలు, ప్రయత్నాలు ఏమయ్యాయని నిలదీత

అశ్వారావుపేట : గోదావరి బేసిన్ పరిధిలోని పెదవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా ఏపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందంటూ ఆయకట్టు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేదాడి జూలై 18న క్లౌడ్‌బరస్ట్‌కు ప్రాజెక్టు కట్టతెగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ సైతం సందర్శించారు. అనంతరం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ సమావేశంలోనూ ఇరురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సమష్టి అంగీకారం తెలిపారు. ఈ సీజన్‌కే సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని, ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని, దిగువ గ్రామాలకు వరద ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. ఇందుకు రూ.19 కోట్ల వ్యయంతో తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా అందులో 80 శాతం నిధులు జీఆర్‌ఎంబీకి డిపాజిట్ చేసేందుకు ఏపీ అధికారులు అంగీకరించారు. ఇక ఆ తర్వాత నిధుల్లేవు, పనుల్లేవు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల వారి పరిస్థితి 'చినుకు పడితే .. కునుకు లేదు' అన్నట్టుగా మారింది.

అటకెక్కిన తుమ్మల హామీ..

గతేడాది జూలై 18వ తేదీ రాత్రి పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోగా 21న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. పంటలు, ఇళ్లు దెబ్బతినడంపై విచారం వ్యక్తం చేయడమే కాక ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు మరమ్మతులు కాదు.. రీడిజైన్ చేయడమే శాశ్వత పరిష్కారమని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని ప్రకటించారు. జీఆర్‌ఎంబీ, ఏపీ ప్రభుత్వంతో సమన్వయం చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 40 వేల క్యూసెక్కుల సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు.

భయమేస్తోంది..



వర్షాకాలం రావడంతో ఎప్పుడేం జరుగుతుందోనని భయంగా ఉంది. ముందస్తు సమాచారం లేకుండా గుమ్మడవల్లి ప్రాజెక్టు గేట్లు తెరిస్తేనే గ్రామాలకు గ్రామాలు కొట్టుకుపోతాయి. అలాంటిది వరదొస్తే గతేడాది జరిగిన బీభత్సం కళ్లముందే కనిపిస్తోంది. ప్రాజెక్టు రీ డిజైన్ చేయాలన్నా.. ఉన్నది ఉన్నట్లు తిరిగి నిర్మించాలన్నా.. ఏపీ నిధులు మంజూరు చేయాలని అంటున్నారు. నిధులు మంజూరయ్యేలోపు ఆయకట్టు రైతులుంటారా..? అనే భయాందోళనలు కలుగుతున్నాయి.

– అక్షకుంట అనంత్, గుమ్మడవల్లి

మభ్యపెడుతున్నారు తప్ప పనుల్లేవు..



గుమ్మడవల్లి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు మభ్య పెడుతున్నారే తప్ప పనులు జరగట్లేదు. కనీసం తెగిపోయిన కట్టను ఇసుక బస్తాలతో తిరిగి కట్టినా ఈ సీజన్‌కు సాగు నీరందేది. మూడు గేట్లు కాదు.. ఐదు గేట్లు బిగించాలంటూ ప్రాజెక్టును మళ్లీ తిరిగి నిర్మిస్తామంటున్నా పైసా కూడా విదిల్చలేదు. ఏపీ నుంచి నిధులు వస్తాయంటే నమ్మశక్యంగా లేదు.

– సాయిల మల్లికార్జునరావు, గుమ్మడవల్లి

అసెంబ్లీలో చర్చిస్తానన్న పోలవరం ఎమ్మెల్యే..

పెదవాగు ఆయకట్టు మొత్తం 16 వేల ఎకరాల్లో 13 వేల ఎకరాలు ఏపీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే ఉంది. అందుకే ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 80 శాతం నిధులు భరించేందుకు జీఆర్‌ఎంబీ సమావేశంలో ఏపీ ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఫిబ్రవరి 11న అశ్వారావుపేటకు వచ్చినపుడు పెదవాగు అంశాన్ని ప్రస్తావిస్తూ అసెంబ్లీలో ప్రాజెక్టు సమస్యపై మాట్లాడతానని హామీ ఇచ్చారు. అయితే నాటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగకున్నా.. అధికార పార్టీ ఎమ్మెల్యే కాబట్టి నేరుగా సీఎంతో మాట్లాడొచ్చు కదా అని రైతులు అంటున్నారు. పోల'వరం' ఎమ్మెల్యే హామీ కూడా ఆచరణ సాధ్యం కాలేదని ఆవేదన చెందుతున్నారు.

2025 వానాకాలం నాటికి రీ డిజైన్, నిర్మాణ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. అయితే ఏడాది కావొస్తున్నా ఇవేమీ ఆచరణకు నోచుకోకపోవడంతో వారిలో నిరాశ అలుముకుంది.

'రింగ్‌బండ్'కు ముప్పు..!

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్టులో రూ.కోట్ల వ్యయంతో తాత్కాలికంగా నిర్మించిన రింగ్‌బండ్‌కు వర్షాలు, వరదతో ముప్పు పొంచి ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మట్టికట్టకు బీటలు ఏర్పడుతుండగా, ఓ చోట భారీగా కోతకు గురై గుంత ఏర్పడింది. వర్షాలు ఇంకా కొనసాగితే మట్టికట్ట వద్ద గండి పడే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ. 3.50 కోట్లు వెచ్చించి నిర్మించిన రింగ్‌బండ్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. రింగ్‌బండ్‌పై ఆధారపడి పంటలు సాగు చేయాలా, వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు.

ఏపీ నిధులు రావడమే ఆలస్యం

జీఆర్‌ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన నివేదిక ప్రకారం రూ.19 కోట్ల నిధులు అవసరం. ఆయకట్టు పంపిణీ ప్రకారం ఏపీలోనే 13 వేల ఎకరాలు ఉంది. అశ్వారావుపేట మండలంలో 3వేల ఎకరాలు మాత్రమే. ప్రాజెక్టు పునర్నిర్మాణ వ్యయంలో 80 శాతం నిధులు సమకూర్చేందుకు ఏపీ ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. వారు జీఆర్‌ఎంబీకి నిధులు జమ చేస్తే పనులు ప్రారంభించొచ్చు.

– ఎ.కృష్ణ, ఇరిగేషన్ డీఈఈ

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్ : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల మందులు, పరీక్ష కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఏ చిన్న సమస్య వచ్చినా.. వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. ఇన్సులిన్, మలేరియా మందుల సరఫరాకు కృషి చేస్తానని చెప్పారు.

'భవిత'తో మనో వికాసం..

భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం కలుగుతుందని కలెక్టర్ అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలోని భవిత కేంద్రాన్ని గురువారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధనకు అవసరమైన అన్ని పరికరాలు, స్టడీ మెటీరియల్ తెప్పించాలని, రెయిలింగ్, రాంప్ వంటివి పటిష్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు.ఫిజియోథెరపిస్టులు కచ్చితంగా కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. గోడౌన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేకుండా ఎవరినీ లోనికి వెళ్లనివ్వొద్దని సిబ్బందికి సూచించారు.

మేకపాల విశిష్టతను తెలియజేయాలి..

జిల్లాలోని మారుమూల గ్రామాల గిరిజనులు, మహిళల వద్ద గల మేకల సంతతిని అభివృద్ధి చేయాలని, అధిక పాల దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన పశువైద్య అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేకపాల విశిష్టతపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. మేకపాల నుంచి పెరుగు, మజ్జిగ, జున్ను, పన్నీరు, చీజ్ వంటి ఉత్పత్తులు తయారు చేసి వినియోగించే పద్ధతులపై ప్రచారం కల్పించాలన్నారు. జిల్లా ప్రజలకు ఆరోగ్యకరమైన మేకపాలు అందించేందుకు ప్రత్యేకంగా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వీటి మార్కెటింగ్ ద్వారా గిరిజనులు, మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. బాతులు, కౌజు పిట్టల పెంపకంపై కూడా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రంగా ప్రసాద్, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్, పశువైద్యాధికారి ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల బదిలీ

జిల్లాలోని ముగ్గురు తహసీల్దార్లు, ఏడుగురు నాయబ్ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించారు.

యూరియా కోసం పడిగాపులు



యూరియా కోసం వేచి ఉన్న రైతులు

ఇల్లెందు: పట్టణంలోని మార్కెట్ యార్డులో రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పంటలకు యూరియా వేసేందుకు వస్తుండడంతో మార్కెట్‌లోని యూరియా విక్రయ కేంద్రం కిటకిటలాడుతోంది. గురువారం రెండు లారీల యూరియాను రైతులు కొనుగోలు చేశారు. ఇప్పటివరకు ఇల్లెందు పీఏసీఎస్‌లో సుమారు 2వేల మంది రైతులు 300 టన్నులు యూరియా కొనుగోలు చేశారు. యూరియా బస్తాలను పీఏసీఎస్ వద్ద కొనుగోలు చేస్తుండగా.. డీఏపీ, 20:20 ఎరువులు మాత్రం ప్రైవేట్ వ్యాపారుల వద్ద తీసుకెళ్తున్నారు. వర్షాలకు ఏపుగా ఎదిగి వస్తున్న పంటలకు యూరియా అవసరం పెరిగింది. అయితే యూరియా కొరత లేదని, రైతులకు అవసరమైనంత అందిస్తున్నామని పీఏసీఎస్ సీఈఓ హీరాలాల్ తెలిపారు.

ప్రజలకు నిత్యం అండగా ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: భారీ వర్షాలు కురుస్తున్న విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో, అండగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. డీడీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే వర్షాలదృష్ట్యా ప్రమాదవశాత్తు వరదల్లో చిక్కుకునే వారిని రక్షించడానికి పోలీసులతో పాటు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డీడీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రెస్క్యూ సమయంలో అవసరమైన లైఫ్ జాకెట్లు, రోప్‌ల వంటి సామగ్రిని సమకూర్చుతామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మురహరి క్రాంతికుమార్, ఆర్‌ఓ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్, ఆర్ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన 'అంగన్‌వాడీ బాట'

- కొత్తగా 13,760 మంది చిన్నారుల చేరిక
- ఐదేళ్లు నిండిన 6,154 మంది పాఠశాలల్లో చేరిక
- టీచర్ పోస్టులు భర్తీ చేస్తే మరింతమంది చేరే అవకాశం



భద్రాచలం అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులు

భద్రాచలంఅర్బన్ : రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జూన్ 10 నుంచి 17 వరకు నిర్వహించిన 'అమ్మమాట – అంగన్ వాడీ బాట' కార్యక్రమం విజయవంతమైంది. అంగన్‌వాడీ కేంద్రాలు అందించే సేవలను తల్లిదండ్రులకు వివరించడంతో జిల్లాలో ఈ ఏడాది కొత్తగా 13,760 మంది చిన్నారులు చేరగా, 3,966 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

పౌష్టికాహారం, ఆటపాటలతో విద్య..

జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో చిన్నారులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భోజనం, గుడ్డు, మురుకులు, బాలామృతం వంటి పౌష్టికాహారం అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు కూడా పాలు, గుడ్డు వంటి పోషకాహారం అందుతోంది. ఆటపాటలు, కథలు, సంభాషణ నైపుణ్యాలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య ద్వారా చిన్నారులకు మంచి అలవాట్లు నేర్పుతున్నారు. పుట్టిన వెంటనే తల్లులు, చిన్నారుల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయడం ద్వారా బాలింతలకు పోషకాహారం, చిన్నారులకు బాలామృతం పంపిణీ చేస్తున్నారు.

ఖాళీల భర్తీతో మరింత బలోపేతం..

జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 1,869 మంది టీచర్లు, 1,103 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఇంకా 191 టీచర్ పోస్టులు, 957 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సమీప కేంద్రాల టీచర్లు ఖాళీగా ఉన్న కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. ఇది వారికి అదనపు భారంగా మారుతోంది. గతేడాది నుంచి ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు పంపినా ఇంకా భర్తీ చేయలేదు. పోస్టుల భర్తీతో పాటు ఆయా సెంటర్లకు పక్కా భవనాలు నిర్మిస్తే లబ్ధిదారులకు మరింతగా సేవలు అందే అవకాశం ఉంటుంది.

ఆరు నెలలుగా అద్దె పెండింగ్

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరు నెలలుగా అద్దె బకాయిలు విడుదల కాకపోవడంతో టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. అద్దె చెల్లించక ఇంటి యజమానుల నుంచి ఒత్తిడి ఎదురవుతోందని వాపోతున్నారు. అలాగే, రెండేళ్లుగా ఈవెంట్ బిల్లులు, మూడేసి నెలలుగా ఆరోగ్యలక్ష్మి, గ్యాస్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని చెబుతున్నారు. జిల్లాలో 785 అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, ఒక్కో భవనానికి నెలకు రూ.వెయ్యి నుంచి రూ.4వేల చొప్పున ఆరు నెలలుగా అద్దె బకాయిలు పేరుకుపోయాయి. అలాగే, సంక్షేమశాఖ ద్వారా అమలయ్యే కార్యక్రమాలు వివరించేందుకు ఈవెంట్లకు రూ.200 నుంచి రూ.500 వెచ్చిస్తుండగా ఒక్కో సెంటర్‌కు దాదాపు రూ.6 వేల నుండి రూ.9 వేల వరకు చెల్లించాల్సి ఉంది.

ఈసారీ కొందరికే యూనిఫామ్





అంగన్‌వాడీ చిన్నారులకు అందజేసిన యూనిఫాం

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు 2024 నుంచి రాష్ట్ర ప్రభుత్వం యూనిఫామ్ అందిస్తోంది. అయితే, జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వయస్సు వారు 33,800 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు పిల్లలు 2,800 ఉన్నారు. అయితే, గత ఏడాది 612 కేంద్రాల్లోని 6,362 పిల్లలకే యూనిఫామ్ పంపిణీ చేశారు. అమ్మాయిలకు గౌన్, అబ్బాయిలకు నిక్కరు, చొక్కా కుట్టించి ఇవ్వగా.. మిగతా మిగతా కేంద్రాల్లో చిన్నారులకు నిరాశ ఎదురైంది. ఈసారి సైతం జిల్లాలో అదే సంఖ్యలో యూనిఫామ్ పంపిణీ చేయనున్నారని తెలుస్తుండగా.. అందరికీ ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల చిన్నారులకు యూనిఫామ్ ఇచ్చి మిగతా వారిని విస్మరించడం సరికాదని చెబుతున్నారు.

అంగన్‌వాడీలకు వచ్చేలా చర్యలు



అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమీప చిన్నారులు చేరేలా అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టాం. వారం రోజుల్లోనే మంచి ఫలితాలు నమోదయ్యాయి. చిన్నారులను చేర్పించే కార్యక్రమం కొనసాగిస్తూనే, కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. అలాగే, అద్దె బకాయిలు, ఈవెంట్ బిల్లులపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు సమర్పించాం. చిన్నారులందరికీ యూనిఫామ్ ఇచ్చేలా అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

– స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమశాఖ అధికారి

సీలింగ్ భూముల స్వాధీనం



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఉద్యోగులు

- ఇతరులకు అమ్మినట్లు తేలడంతో చర్యలు
- స్వాధీనం చేసుకున్న భూమి విలువ రూ.50కోట్లు!

ఖమ్మంఅర్బన్: సీలింగ్ భూములను లబ్ధిదారులు సాగు చేసుకోకుండా ఇతరులకు అమ్ముకున్నట్లు తేలడంతో స్వాధీనం చేసుకోవడంపై అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు గ్రామంలో సర్వే నంబర్ 196లో ఉన్న 9.9 ఎకరాల భూమిని కోర్టు ఆదేశాలతో గురువారం ఖమ్మం అర్బన్ ఆర్ఐ వాహిద్, సర్వేయర్ నాగేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటుచేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘనతో..

సర్వేనంబర్ 196లోని భూములను గతంలో ఇద్దరు రైతులకు అసైన్‌మెంట్ రూపంలో కేటాయించారు. అయితే, స్వయంగా సాగు చేసుకోవాలే తప్ప విక్రయించొద్దనే నిబంధన విధించారు. కానీ వారిద్దరు ఇతరులకు అమ్మగా.. ఆపై ఇంకొన్ని చేతులు మారినట్లు తేలింది. ఈనేపథ్యాన కోర్టు సూచనల మేరకు 9.9 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ సైదులు తెలిపారు. ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని నిర్ణయించగా, ఎవరూ ఆక్రమించకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.

ప్లాట్ల యజమానుల్లో ఆందోళన

సీలింగ్ భూములు తీసుకున్న వారు సాగు చేయకపోవడమే కాక ఇతరులకు విక్రయించారు. ఆపై చేతులు మారగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు దక్కించుకుని ప్లాట్లుగా విడగొట్టి 80 మందికి విక్రయించినట్టు తెలిసింది. నిబంధనలు ఉల్లంఘించారని అధికారులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఉత్తర్వులతో స్వాధీనం చేసుకోవడంతో విషయం తెలియక ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలియగానే పలువురు అక్కడకు చేరుకుని డాక్యుమెంట్ల ఆధారంగా పరిశీలించడం కనిపించింది.

క్లుప్తంగా

ఉన్నతంగా రాణించాలి



శిశుమందిర్ వద్ద ట్రైనీ కలెక్టర్ తదితరులు

బూర్గంపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ అన్నారు. బూర్గంపాడులోని సరస్వతి శిశుమందిర్‌ను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని వసతులను పరిశీలించారు. విద్యార్థులతో, పాఠశాల నిర్వాహకులతో మాట్లాడారు. ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన జరిగితే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, ఉన్నత లక్ష్యాలను విద్యార్థులకు చిన్నతనం నుంచే నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌గోపాల్, చెంగలరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం కొత్తగూడెంలోని జరిగిన పారిశుద్ధ్య పనులను ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ పరిశీలన చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగంలో రికార్డులను పరిశీలించారు. కాగా 2,5,4,20,23 డివిజన్లలో మురుగు కాల్వల్లో సిల్ట్ తొలగించారు. అంతర్గత రహదారులు వెంట ఉన్న చెట్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమాల్లో మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, శానిటరీ జవాన్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ములకలపల్లి: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ తెలిపారు. మండల పరిధిలోని కమలాపురం ఆశ్రమ పాఠశాలలో మంగపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరు పరిశీలించి పలు సూచనలు చేశారు. వైద్యాధికారి సాయికల్యాణ్, ప్రోగ్రాం ఆఫీసర్ మధు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముష్టికుంట్ల విద్యార్థులు

బోనకల్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో బోనకల్ మండలం ముష్టికుంట్ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా 90 మంది విద్యార్థులు పాల్గొనగా అండర్ పాఠశాల విద్యార్థులు బొడ్డుపల్లి నవ్యశ్రీ, షేక్ ఫరీదా ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపికయ్యారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

పాల్వంచ: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గురువారం ఆటో డ్రైవర్ దాడికి పాల్పడటంతో కేసు నమోదైంది. మణుగూరు నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు పాల్వంచ బస్టాండ్‌లోకి వస్తోంది. ఈ క్రమంలో ఇన్ గేట్ వద్ద ఆటో ఉండటంతో స్వల్పంగా ఢీకొట్టింది. దీంతో బొల్లేరుగూడేనికి చెందిన ఆటో డ్రైవర్ తరాల సంతోష్ ఆగ్రహంతో బస్సు డ్రైవర్ జక్కం రమేష్‌ను దూషించి, దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

‘డ్రాగన్’ కాసులు!

ఏడెకరాల రాళ్ల భూమిలో రైతు వెంకటేశ్వరరావు ప్రయోగం

- నాటిన 20 నెలల్లో ప్రారంభమైన డ్రాగన్ పండ్ల దిగుబడి
- తొలి కాతలో ఎకరాకు ఐదు టన్నుల కాయలు
- టన్ను డ్రాగన్ పండ్లకు రూ. లక్ష ఆదాయం



ఆసుపాకలో సాగు చేసిన డ్రాగన్ తోట



అశ్వారావుపేటరూరల్: రాళ్లభూమిలో ఓ రైతు ధైర్యంతో సాగు చేసిన డ్రాగన్ పంట కాపునకు వచ్చింది. అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామ శివారులో రైతు బీర్రం వెంకటేశ్వరరావు తన ఏడెకరాల చేలో దాదాపు ఇరవై నెలల క్రితం డ్రాగన్ తోట సాగు చేశాడు. ప్రయోగాత్మకంగా, లక్షలాది రూపాయాల పెట్టుబడితో సాగు చేపట్టాడు. దిగుబడి మొదలుకాగా రైతు మోములో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎకరానికి ఐదు టన్నులు..

డ్రాగన్ తోటకు ఒక్కసారి పెట్టుబడి పెట్టి సాగు చేస్తే దాదాపు ఇరవై ఏళ్లవరకు దిగుబడి వస్తుంది. పంట సాగుకు ఒక ఎకరానికి సుమారు రూ.6 నుంచి రూ.7 లక్షల దాకా ఖర్చు అవుతుండగా, ఎకరానికి దాదాపు నాలుగు వేల డ్రాగన్ మొక్కలు నాటుకోవచ్చు. ఎకరాకు 500 సిమెంట్ స్తంభాలు అవసరం కాగా, ఒక్కో స్తంభానికి 10 మొక్కలు పెట్టుకోవచ్చు. మొక్కలకు డ్రిప్ ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉండగా, ఈ పంట సాగుకు నీరు పెద్దగా అవసరం లేదు. పంట సాగు చేసిన 18 నెలల తర్వాత పంట దిగుబడి ప్రారంభమైంది. ఏటా జూన్ మాసంలో పంట దిగుబడి మొదలై నవంబర్ వరకు ఉంటుంది. తొలిసారి పంట దిగుబడిగా ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నుల వరకు కాయలు దిగుబడి వచ్చాయి.

తొలి ఏడాది దిగుబడి తక్కువ వచ్చినా రెండో ఏడాది నుంచి దిగుబడి రెండింతలు పెరిగే అవకాశం ఉంది. కాగా, మార్కెట్లో డ్రాగన్ ఫ్రూట్ టన్ను ధర రూ.లక్ష వరకు ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతో లాభదాయకంగా మారింది. డ్రాగన్ పండ్లను అశ్వారావుపేట, సత్తుపల్లి, ఏపీలోని విజయవాడ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నామని, తోట వద్ద కేజీ రూ.150కు విక్రయిస్తున్నామని రైతు తెలిపాడు.



తోటలో కాసిన డ్రాగన్ పండ్లు

మార్కెటింగ్‌కు ఇబ్బందే..



పంట సాగుకు రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. అయినా ఆసక్తి ఉండటంతో ముందుకు సాగా. ప్రస్తుతం మార్కెట్లో డ్రాగన్ పండ్లకు డిమాండ్ ఉంది. కానీ విక్రయాలకు కొంతమేర ఇబ్బందులు ఉన్నాయి. కాయల కోత తర్వాత మూడు రోజుల్లోనే విక్రయించాలి. లేనిపక్షంలో కాయ దెబ్బతిని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. దూర ప్రాంతాలకు రవాణా చేయాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– బీర్రం వెంకటేశ్వరరావు, ఆసుపాక, అశ్వారావుపేట మండలం

కిష్టారంలో ‘చావు’ కష్టాలు

అంతిమ సంస్కారాలకు వర్షాకాలంలో వాగు దాటేందుకు అవస్థలు



దహన సంస్కారాలకు మృతదేహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రామస్తులు

టేకులపల్లి: మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో అంతిమ సంస్కారాలకు తిప్పలు తప్పడంలేదు. గ్రామానికి చెందిన కొర్స నర్సయ్య బుధవారం మృతి చెందాడు. శ్మశాన వాటిక ముర్రేడు వాగు అవతల వైపు ఉంది. దీంతో గురువారం దహనసంస్కారాలు చేసేందుకు వాగు దాటి వెళ్లేందుకు అష్టకష్టాలు పడ్డారు. సుమారు రెండు వేల ఎకరాల వ్యవసాయ భూములు కూడా అటువైపే ఉన్నాయి. చిన్న వర్షానికి కూడా వాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని 40 ఏళ్లుగా అధికారులకు, ప్రజాప్రతినిదులకు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని రైతులు, గ్రామ పెద్దలు చింత జోగయ్య, జబ్బ జోగయ్య, పాయం లక్ష్మినర్సు, బొల్లి కృష్ణ, చింత రాంబాబు, వేప లక్ష్మయ్య, చింత నాగేశ్వరరావు, కంగలభద్రయ్య, చింత సంపత్, ఏపె పగడయ్య కోరారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే బనకచర్లపై రాద్ధాంతం

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: వాగ్దానాల అమలులో విఫలమైన కాంగ్రెస్, కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి బీఆర్‌ఎస్ కలిపి బనకచర్ల ప్రాజెక్టుపై రాద్ధాంతం మొదలుపెట్టాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఇదే సమయాన ఏపీ, తెలంగాణ నడుమ వివాదాన్ని పెంచి పెద్ద చేసి పెద్దన్న పాత్ర పోషిస్తూ లబ్ధి పొందాలని కేంద్రప్రభుత్వం యత్నిస్తోందని పేర్కొన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక, ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అర్థం చేసుకుని ఉద్రేకాలకు గురికావొద్దని ఆయన కోరారు. కృష్ణా, గోదావరి నికర జలాల పంపిణీ హేతుబద్ధంగా జరగాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈమేరకు మిగులు జలాల పంపిణీపై తెలంగాణ, ఏపీ అవసరాల ఆధారంగా కేంద్ర జలసంఘం రెండు రాష్ట్రాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈనెల 9న కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన దేశ వ్యాప్త బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

ఫీజు బకాయిలు విడుదల చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలలో జాప్యం చేయడం సరికాదని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ పేర్కొన్నారు. బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో నాయకులు గురువారం ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాల ముట్టడికి యత్నించారు. ఈక్రమాన పోలీసులు వారిని అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, రూ.వేల కోట్ల బకాయిలను చెల్లించడం లేదని ఆరోపించారు. ఇకనైనా బకాయిలు విడుదల చేయడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుచేసి ఉచిత బస్ పాసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు వినయ్, కార్తీక్, పృధ్వీ, సురేష్, నసీర్, చందు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే ఆదినారాయణ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట : అశ్వారావుపేట నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. గురువారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారేతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అవసరమైన చోట రహదారులు, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. అంతకుముందుగా మంత్రి తుమ్మలను, సత్తుపల్లి నూతన పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, విద్యుత్ , పంచాయతీరాజ్, అటవీ శాఖల అధికారులు, మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు అలపాటి ప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, కేవీ సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

‘రివర్‌సైడ్’కు ఆదరణ కరువు

గోదావరి నదీ తీరంలోని విడిది కుటీరాల తొలగింపు



నిరుపయోగంగా ఉన్న కుటీరాలు



కుటీరాలను తొలగిస్తున్న సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానం సందర్శించిన భక్తులతోపాటు పర్యాటకులు గోదావరి నదీ తీరంలో బస చేసే విధంగా ఏర్పాటు చేసిన విడిది కుటీరాలను తొలగిస్తున్నారు. వర్షాకాలం కావడంతో గోదావరికి వరదలు వస్తే మునిగిపోతుందనే కారణంతోపాటు పర్యాటకుల నుంచి ఆదరణ లేకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. గత జనవరిలో భద్రాచలం నదీ తీరంలో ఏర్పాటు చేసిన ఏరు ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ విడిది (రివర్ సైడ్ క్యాంప్) కుటీరాలు ఏర్పాటు చేయించారు. ప్రారంభం నుంచీ పర్యాటక ఆదరణ లభించలేదు. మొదటిసారి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని 17 మంది విడిది చేశారు. ఆ తర్వాత ఒకరిద్దరు తప్ప ఎప్పుడూ పర్యాటకులతో కుటీరాలు నిండింది లేదు. చార్జీలు భారీగా ఉండటంతో పర్యాటకులు ఆసక్తి చూపడంలేదని భావించిన అధికారులు.. చార్జీలు తగ్గించారు. ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. ముగ్గురు, నలుగురు సభ్యులు కలిగిన కుటుంబం బస చేసేలా సిద్ధం చేశారు. 12 గంటలు బస చేసే పర్యాటకులకు రూ.500 చార్జీతో పాటు వారి అభ్యర్థన మేరకు భోజన వసతి కల్పించాలని నిర్ణయించారు. అయినా ఆదరణ లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. దీంతో నిర్వహణ బాధ్యతను డీఆర్‌డీఏ అధికారుల నుంచి స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఎండాకాలం తాటాకు పందిళ్లు కూడా ఏర్పాటు చేశారు. అయినా మార్పులేకపోవడంతో వాళ్లు కూడా వదిలేశారు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి, రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇక చంద్రుగొండ మండలం బెండాలపాడు, దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్ప, పాల్వంచ మండలం కిన్నెరసాని, ఐటీడీఏ గిరిజన మ్యూజియం వద్ద ఏర్పాటు చేసిన గిరిజన పల్లె వాతావరణ ఆవాసాలను పర్యాటకులు తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం అధికారులు సుమారు రూ.35 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. వాటికి కూడా ఆదరణ లేకపోవడంతో ప్రజాధనం వృథా అయిందని పలువురు పేర్కొంటున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటరెడ్డి(ఫైల్)

బూర్గంపాడు: మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన యక్కంటి వెంకటరెడ్డి గత నెల 30వ తేదీన ఇంటి నుంచి సారపాకకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధు, మిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లేదు. దీంతో ఆయన తండ్రి అల్లూరురెడ్డి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరెడ్డి ఆచూకీ తెలిస్తే 87126 82055 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. మల్లెలమడుగు గ్రామ పంచాయతీలోని చింతకుంట గ్రామానికి చెందిన ఓ గిరిజన యువతి పొలంలో ఉండగా మొండికుంట గ్రామానికి చెందిన తోవిటి యాదగిరి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఈ నెల 1న పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలం వద్ద డీఎస్పీ విచారణ చేపట్టి బాధితురాలు, సాక్షుల వాంగ్మూలం సేకరించారు. సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై మధుప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామం వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై గురువారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని నలుగురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఏపీ రాష్ట్రం వెలేరుకు చెందిన వరపర్ల గోపాలరావు భార్య ప్రవళిక, ఇద్దరు కూతుళ్లతో అశ్వాపురం మండలం చింతిర్యాలలోని అత్తగారింటికి వచ్చి బైక్‌పై వెళ్తున్నారు. అదే సమయంలో భారజల కర్మాగారం ఉద్యోగి ప్రమోద్ బైక్‌పై అశ్వాపురం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో సీతారాంపురం గ్రామం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ప్రమోద్‌తోపాటు గోపాలరావు, అతని భార్య ప్రవళిక, చిన్న కూతురు అద్వితకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108లో భద్రాచలం ప్రభుత్వాస్పత్రులకు తరలించారు.

రహదారిపై కూలిన చెట్టు

అశ్వాపురం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున ఓ చెట్టు రహదారిపై కూలింది. దీంతో మార్కెట్ రోడ్‌లో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి మల్లేశం, సిబ్బంది జేసీబీ సహాయంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

లారీ బోల్తా

అశ్వారావుపేటరూరల్: అదుపుతప్పి ఓ లారీ బోల్తా పడిన ఘటన గురువారం జరిగింది. మండలంలోని అచ్యుతాపురం వద్దగల ఫారెస్టు రీసెర్చ్ సెంటర్ సమీపంలో మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయల బస్తాల లోడుతో ఏపీలోని రాజమండ్రి వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ముగ్గురు కాపర్ దొంగల అరెస్ట్

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్ 5 ఇంక్లైన్ ఏరియా సమీపంలో 16 మీటర్ల కాపర్ వైరు చోరీ చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ ప్రతాప్ కథనం ప్రకారం.. గత నెల 23న సెక్యూరిటీ డ్యూటీ మారుతున్న సమయంలో మాయాబజార్‌కు చెంది తాపర్ల వెంకటేష్, రామవరానికి చెందిన పానీ రాము, రుద్రంపూర్‌కు చెందిన ఎంపల్లి ఆకాష్‌లు రూ.10,900 విలువైన కాపర్ వైరు చోరీ చేశారు. గుర్తించిన సింగరేణి అధికారులు సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా నిందితులు కాపర్ వైరుతో పారిపోతుండగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

అసిస్టెంట్ లైన్‌మన్‌పై దాడి

బూర్గంపాడు: విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్‌మన్‌పై గురువారం దాడి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సారపాకలోని రిక్షాకాలనీకి చెందిన అలోత్ శాంతి విద్యుత్‌శాఖకు రూ.3,300 కరెంట్ బిల్లు బకాయి ఉంది. పలుమార్లు కోరినా బిల్లు చెల్లించకపోవటంతో గురువారం విద్యుత్ కనెక్షన్ తొలగించేందుకు అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీనివాస్ వెళ్లగా, శాంతి, ఆమె కుమారుడు నవీన్‌లు వాగ్వాదానికి దిగి దాడి చేశారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మకానికి ‘సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ’

- ప్రైవేటు సెక్యూరిటీ గార్డు పోస్టుల నియామకాలకు వసూళ్లు
- ఒక్కో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగానికి రూ.1.50 లక్షలు !
- డబ్బులు ఇచ్చినా ఉద్యోగం రాక ఓ యువకుడి ఆత్మహత్య
- సదరు ఏజెన్సీపై చర్యలు చేపట్టని సింగరేణి అధికారులు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ప్రైవేట్, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డు పోస్టుల నియామకంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డబ్బులు ఇచ్చినా కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏజెన్సీ ఉద్యోగం ఇవ్వకపోవడంతో బాధితులు మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పినపాక మండలానికి చెందిన యువకుడు పూనెం సంప్రీత్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన సింగరేణిలో చర్చనీయాంశంగా మారగా, సూసైడ్ నోట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.

ఒక్కో పోస్టుకు రూ. 1.50 లక్షలు!

సదరు కంపెనీ 2024లో సెక్యూరిటీ విభాగం కాంట్రాక్ట్ దక్కించుకోగా, 2025 డిసెంబర్‌తో గడువు ముగియనుంది. పోస్టులకు ప్రారంభం నుంచే డబ్బులు వసూళ్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు సదరు కంపెనీ సూపర్‌వైజర్ వసూళ్లు చేసినట్లు సమాచారం. సంప్రీత్ కూడా సూపర్‌వైజర్ అమరేందర్‌రెడ్డికే డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. నెలలు గడుస్తున్నా ఉపాధి చూపకపోవడంతో పలుమార్లు అడుగగా అమరేందర్‌రెడ్డి ఖాళీ చెక్కు ఇచ్చినట్లు తెలుస్తోంది. చెక్కు ఇచ్చినా డబ్బులు అందక, ఉపాధి లభించక మరోవైపు అప్పు, వడ్డీలు కట్టలేక సంప్రీత్ మనోవేదన చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విప్పలసింగారానికి చెందిన ఓ యువకుడి నుంచి రూ. లక్ష తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నెలల తరబడి సెక్యూరిటీ గార్డు ఉద్యోగం కల్పించకపోవడంతో వడ్డీకి తెచ్చిన డబ్బులు కావడంతో కుటుంబ పెద్ద గుండెపోటుతో మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు. గతంలో పగిడేరుకు చెందిన కొందరు యువకులు రన్నింగ్‌లో ఎంపికైనా డబ్బులు డిమాండ్ చేయడంతో.. వారు సూపర్‌వైజర్‌కు డబ్బులు ఇచ్చి మోసపోయారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి డబ్బులు తిరిగి పొందారు.

చర్యలు తీసుకోని సింగరేణి యాజమాన్యం

సింగరేణి నిర్వాసితులకు, ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు యాజమాన్యం ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా ఉపాధి కల్పిస్తుంది. కానీ సదరు కాంట్రాక్టర్ డబ్బులు తీసుకుని స్థానికేతరులను నియమించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై డైరెక్టర్(పా), సెక్యూరిటీ జీఎంలకు ఫిర్యాదులు అందినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు, కార్మిక నాయకులు కోరుతున్నారు. కాగా ఈ వ్యవహారంపై సింగరేణి మణుగూరు ఏరియా డీజీఎం (పర్సనల్) సలగల రమేష్‌ను వివరణ కోరగా.. సమస్యపై మురళి మ్యాన్ పవర్ కంపెనీ బాధ్యులతో చర్చించామని, సమస్యను పరిష్కరించాలని సూచించామని తెలిపారు.



సింగరేణి జీఎం కార్యాలయం

నా చావుకు వారే కారణం

సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య





సూసైడ్ నోట్ (ఇన్‌సెట్) సంప్రీత్ (ఫైల్)

పినపాక: సింగరేణి మణుగూరు ఏరియాలో కాంట్రాక్ట్ పద్ధతిన సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఏడాది క్రితం డబ్బు వసూలు చేసిన సంస్థ.. ఇప్పటికీ ఉద్యోగం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. పినపాక మండలం పోట్లపల్లి గ్రామానికి చెందిన పూనెం సంప్రీత్ (25) సెక్యూరిటీ గార్డు ఉద్యోగం కోసం గతేడాది మురళి మ్యాన్ పవర్ కంపెనీకి రూ.1.50 లక్షలు చెల్లించాడు. ఐదారు నెలలు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో సంస్థ సూపర్‌వైజర్ అమరేందర్‌రెడ్డిని నిలదీశాడు. దీంతో ఆయన సంప్రీత్‌కు ఖాళీ చెక్కు ఇవ్వగా.. ఆ చెక్కు కూడా బౌన్స్ అయింది. అయినా కంపెనీ వారు కోర్టు విచారణకు రాకపోవడం, మరోవైపు సంప్రీత్ చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతుండడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం పురుగుల మందు తాగగా.. కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా, ‘అమ్మా, నాన్నా నన్ను క్షమించండి, నా చావుకు మురళీ మ్యాన్ పవర్ సెక్యూరిటీ ఏజెన్సీనే కారణం, ఏజెన్సీకి చెందిన మురళి, వెంకట్, మణికంఠ, అమరేందర్‌రెడ్డే బాధ్యులు’ అంటూ సంప్రీత్ రాసిన సూసైడ్ నోట్ గురువారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.